సాక్షి
రంగారెడ్డి
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



బొప్పాయి.. సాగు మేలోయి
బొప్పాయి పంటకు తెగుళ్లు ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త శ్రీకృష్ణ సూచించారు. 8లో▸



స్థానికులకే కేటాయించాలి
డబుల్ ఇళ్లు స్థానికులకే ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. 8లో▸



పథకాలతో ఆర్థిక పురోగతి
ప్రభుత్వ పథకాలతో పేదలు ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

షాద్‌నగర్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గురువారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. 9959226287 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు.

తండా రోడ్లకు రూ.11.65 కోట్లు

మహేశ్వరం: ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలోని తండాలకు బీటీ రోడ్లు నిర్మించేందుకు రూ.11.65 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి సబితారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని గ్రామాలు, ప్రధాన రహదారుల నుంచి ఆయా తండాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

గ్రామకంఠం భూమిని కాపాడండి



ఎమ్మెల్యేను కలిసిన కాశీంబౌలి గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: గ్రామ కంఠం భూమిని పరిరక్షించాలని కోరుతూ.. కాశీంబౌలి, నదీమ్‌నగర్‌వాసులు బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాశీంబౌలీ అనుబంధ గ్రామమైన నదీమ్‌నగర్ గ్రామ కంఠం భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి కబ్జాలను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాశీంబౌలి ఉప సర్పంచ్ నల్ల జయరామ్‌రెడ్డి, అమ్డాపూర్ మాజీ ఉప సర్పంచ్ దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11నుంచి నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం సీడీపీఓ కార్యాలయంలో బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీసం వేతనం ఇవ్వాలని పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, టీఏ, డీఏలు, హెల్త్‌కార్డులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, బుగ్గరాములు, చందునాయక్, అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, పద్మ, వైదేవి, పెంటమ్మ ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

షాద్‌నగర్: భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు పంపిణీ చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సంఘం సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు మోటార్ సైకిళ్లు అందజేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. వెల్ఫేర్ బోర్డ్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం మండల కమిటీ అధ్యక్షుడిగా శివ, కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా రాములు, ఉపాధ్యక్షులుగా మహేష్, పాండు, శ్యాం, గోపాల్, సహాయ కార్యదర్శులుగా సుబ్బారావు, జంగయ్య, చెన్నయ్య, కృష్ణను ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, పార్వతి, జగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నిండుగా.. చేపల పండుగ



చేప పిల్లల పంపిణీ ఇలా..

సంవత్సరం	చెరువులు	చేపపిల్లలు	బడ్జెట్
2017-18	280	99.74 లక్షలు	రూ.62,41,039
2018-19	72	27.69 లక్షలు	రూ.21,54,180
2019-20	327	70.50 లక్షలు	రూ.41,31,002
2020-21	578	1.29 కోట్లు	రూ.70,23,773
2021-22	794	1.60 కోట్లు	రూ.1.25 కోట్లు
2022-23	794	1.80 కోట్లు	రూ.1.30 కోట్లు
2023-24	800	1.96 కోట్లు	రూ.1.33 కోట్లు

మత్స్య సహకార సొసైటీలు	:	121
సభ్యులు	:	7,000
చెరువులు	:	800
వదలనున్న చేపపిల్లలు	:	1.96 కోట్లు

రేపటి నుంచి చెరువుల్లోకి చేప పిల్లల విడుదల

- రావిర్యాలలో శ్రీకారం చుట్టనున్న మంత్రి సబితారెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: చేపపిల్లల పంపిణీకి సర్వం సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా 800 చెరువుల్లో రూ.1.33 కోట్ల విలువ చేసే 1.96 కోట్ల చేపపిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 8న రావిర్యాల చెరువులో మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో మెజార్టీ చెరువులు పూర్తిగా నిండాయి. దీంతో ఈఏడాది చేపల పెంపకంపై మత్స్యకారులు బోలెడు ఆశలు పెట్టుకున్నారు.

అనేక సవాళ్లు

పరిశ్రమల నుంచి వెలువడుతున్న ప్రమాదకరమైన రసాయనాలతో పాటు నివాసాల నుంచి విడుదలవుతున్న మురుగు నీరు చేరడంతో చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయి. దీంతో వదిలిన కొద్ది రోజులకే చేపపిల్లలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా రావడం లేదని చెబుతున్నారు.

వరదలు తగ్గిన వెంటనే..

జిల్లాలో 121 మత్స్యకార సొసైటీలు ఉండగా, వీటిలో సుమారు ఏడు వేల మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తోంది. గత ఏడాది 780 చెరువుల్లో రూ.1.30 కోట్ల విలువ చేసే సుమారు 1.80 కోట్ల చేపపిల్లలను వదలారు. ఈసారి 800 చెరువుల్లో 1.96 కోట్ల చేపపిల్లలను వదలాలని నిర్ణయించారు. ఈ మేరకు ఔత్సాహిక చేపపిల్లల విత్తన కంపెనీల నుంచి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. తూర్పుగోదావరి, కైకలూరు, సూర్యాపేట జిల్లాలకు చెందిన నలుగురు సీడ్ వ్యాపారులు ఈ టెండర్లు దక్కించుకున్నారు. 80 నుంచి 100 ఎంఎం సైజు బొచ్చ, రవ్వు, మోసు రకం చేపపిల్లలతో పాటు 35 నుంచి 40 ఎంఎం సైజు బొచ్చ, రవ్వు, బంగారు తీగ చేపపిల్లలను ఖరారు చేశారు. ఎంపిక చేసిన 20 పెద్ద చెరువుల్లో 80- 100 ఎంఎం సైజు చేపపిల్లలను వదలాలని నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటం, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతుండటంతో వర్షాలు తగ్గిన వెంటనే చేప పిల్లలు వదలాలని భావిస్తున్నారు.

నాణ్యత, లెక్కల్లో గోల్‌మాల్

ఇదిలా ఉండగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేపపిల్లల నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్దేశించిన చేపపిల్లలు కాకుండా నాసిరకం సీడ్ సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 1,800 చేపపిల్లలు ఉండాల్సిన ఒక్కో ప్యాకెట్‌లో 750కి మించి ఉండటం లేదని తెలుస్తోంది. గతంలో ఇలాంటి సంఘటనలు అనేకం వెలుగుచూశాయి. కనీసం ఈసారైనా అవకతవకలకు తావు లేకుండా నాణ్యమైన సీడ్‌తో పాటు నిర్దేశించిన సంఖ్యకు తగ్గకుండా చేపపిల్లలు ఇవ్వాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి.

మనుగడ ప్రశ్నార్థకమే..

సాధారణంగా చెరువులో వదిలిన 35-40 ఎంఎం సైజు చేపపిల్ల కిలో బరువు పెరగాలంటే.. చెరువులో నిల్వ ఉండే నీటి నాణ్యత, లభించే ఆహారంతో పాటు కనీసం పది నెలల సమయం పడుతుంది. జిల్లాలో మెజార్టీ చెరువులు, కుంటలు మార్చి చివరి నాటికే అడుగంటుతుంటాయి. చాలా చెరువులు ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా ఆనుకుని ఉండటం, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి వెలువడే మురుగునీటి వ్యర్థాలు సహా పారిశ్రామిక రసాయనాలు నేరుగా వీటిలో కలుస్తుండటంతో నీరు కలుషితమవుతోంది. ఫలితంగా చేపలు చనిపోవడంతో పాటు ఎదుగుదల లోపిస్తోంది. దీనికి తోడు జలాషయాల్లో పేరుకుపోయిన ఫంగస్, బ్యాక్టీరియా కారణంగా చేపలకు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వీటన్నింటినీ తట్టుకుని ఎంతో కొంత ఎదిగిన చేపలు కూడా ఏప్రిల్, మే మాసాల్లో నీటి వేడిమిని తట్టుకోలేక చనిపోతున్నాయి. ఫలితంగా మత్స్యకారులకు నిరాశే మిగులుతోంది. ఇదిలా ఉండగా జిల్లా మత్స్యశాఖ అధికారులు మాత్రం ఏటా ఐదు వేల టన్నుల దిగుబడి వస్తోందని లెక్కలు చెప్పడం విశేషం.



ఉదయం 11 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

ఇదేం పనితీరు

- కొత్తూరు తహసీల్ కార్యాలయంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- తహసీల్దార్ లేక భూముల క్రయవిక్రయదారుల అవస్థలు
- సాయంత్రం 5గంటల తర్వాత ఇన్‌చార్జ్ అధికారితో కొనసాగిన ప్రక్రియ

కొత్తూరు: స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూముల క్రయవిక్రయదారులు ఇబ్బంది పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వ్యవసాయ భూముల అమ్మకం, కొనుగోలుదారులు స్లాట్ బుక్ చేసుకుని బుధవారం కార్యాలయానికి చేరుకున్నారు. కానీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు తహసీల్దార్ జానకి అందుబాటులో లేరు. ఆమె ఆఫీసుకు వస్తారో.. రారో? సిబ్బందికి కూడా సమాచారం లేదు. దీంతో గంటల తరబడి వేచి చూసిన అనంతరం కొంతమంది షాద్‌నగర్ ఆర్డీఓను ఫోన్‌లో సంప్రదించగా.. తహసీల్దార్ లేరని సమాధానం చెప్పారు. తాను కూడా సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశానన్నారు. కానీ రిజిస్ట్రేషన్లు చేస్తారా.. వాయిదా వేస్తారా..? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో అసహనానికి గురైన కొంతమంది తిరిగి వెళ్లిపోయారు. అధికారులు అందుబాటులో లేకపోతే కనీసం సమాచారం ఇవ్వాలని కానీ ఇలా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులన్నీ వదులుకుని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఇదిలా ఉండగా సాయంత్రం 5:30 గంటలకు ఇన్‌చార్జ్ అధికారి, ఫరూక్‌నగర్ మండల డిప్యూటీ తహసీల్దార్ నాన్యనాయక్ వచ్చి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. అయితే అప్పటికే కొంతమంది తిరిగి వెళ్లిపోయారు.

పెంజర్ల రైతుల ధర్నా

తమ పొలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పెంజర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరాల నిమిత్తం తమ సొంత భూములను ఇతరులకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ధరణి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఈనెల 5న స్లాట్ బుక్ చేసుకున్నామన్నారు. కొనుగోలుదారులతో కలిసి మంగళవారం ఆఫీసుకు వెళ్లగా.. తహసీల్దార్ జానకి రిజిస్ట్రేషన్ చేయలేదని ఆరోపించారు. తమ రిజిస్ట్రేషన్లు ఆపేయాలంటూ ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో.. వాస్తవాలు తెలుసుకోకుండా రిజిస్ట్రేషన్లు ఆపేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ధర్నా విరమించాలని ఆందోళనకారులకు సూచించారు. బాధిత రైతులు షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావును ఫోన్‌లో సంప్రదించగా ఇన్‌చార్జ్ అధికారి వచ్చి సమస్యను పరిష్కరిస్తారని చెప్పడంతో ధర్నా విరమించారు.

కలిసి పనిచేస్తే గెలుపు మనదే

- దేశంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్
- హస్తం పార్టీలో పలువురి చేరిక

షాబాద్: కలిసికట్టుగా పనిచేస్తే కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం పామెన భీంభరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయి కేడర్ బలంగా ఉంటేనే పార్టీ పటిష్టంగా తయారవుతుందని తెలిపారు. పనిచేసే కార్యకర్తలు కాంగ్రెస్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈసారి జరిగే ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని, గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషిచేయాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టంచేశారు. దేశంలో, రాష్ట్రంలో ఈసారి అధికారం మనదేనని స్పష్టం చేశారు. టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు భీంభరత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ముందుకు సాగాలని కోరారు. నిరంతరం ప్రజల మధ్య ఉండాలని శ్రేణులకు సూచించారు. పార్టీలో చేరిన వారిలో కొత్తపల్లి నవీన్, కల్లెం ఆనంద్‌తో పాటు మరో 30 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బోడంపహాడ్ నాయకులు ఎండీ రఫీక్, వెంకటేష్, స్వామి, ఇమ్రాన్, శ్రీధర్, మల్లేశ్, శ్రీకాంత్‌రెడ్డి, రంజిత్, నరేష్, సాయి, సందీప్, ఇర్ఫాన్, జానీ, కృష్ణ, ఉమర్, రఘునాథ్‌రెడ్డి, కృష్ణ, సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతికి బాధ్యులపై కేసు పెట్టండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న విష్ణుప్రియనగర్‌లో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా వరద నీటిని దారి మళ్లించేందుకు నాలా పైకప్పు తెరిచి ఉంచడంతోనే నాలుగేళ్ల బాలుడు తేజస్ మిథున్‌రెడ్డి అందులో పడి మృతి చెందాడని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అభిషేక్ అగస్త్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైనవారిని గుర్తించి పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. విష్ణుప్రియనగర్‌లోని తుర్క చెరువుకు అనుసంధానంగా ఉన్న నాలా పైకప్పును వరద ఉద్ధృతి మళ్లించేందుకు మంగళవారం తెరిచి ఉంచారు. దీనిని దాటి వెళ్లేందుకు యత్నించిన తేజస్ మిథున్ రెడ్డి అందులో పడి కొట్టుకుపోయి మృతి చెందాడని అధికారులు, బాలుడి తల్లిదండ్రులు వివరించారు. ఈ మేరకు బాధ్యులను గుర్తించి కేసు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సంబంధిత అపార్టుమెంట్ యజమానిపైనా కేసు నమోదు చేయాలని బాచుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను అభిషేక్ అగస్త్య ఆదేశించారు.

మహోగ్ర మూసీ!



మూసారాంగ్‌బాగ్ వద్ద మూసీ ఉగ్రరూపం

గండిపేట చెరువు 6 గేట్లను ఎత్తి నీటిని కిందకు వదులుతుండటంతో మూసీ నదిలో వరద కొనసాగుతోంది. దీంతో నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి మంచిరేవుల గ్రామానికి వెళ్లే రోడ్డును మూసివేశారు. అక్కడ వంతెన కిందకు ఉండటం, దాని పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. దీంతో మంచి రేవుల గ్రామస్తులు ఔటర్ సర్వీసు రోడ్డు మీదుగా నార్సింగికి రాకపోకలు సాగిస్తున్నారు. గండిపేట చెరువులోకి ఇంకా పరివాహకం నుంచి వరద కొనసాగుతుండటంతో గేట్లను తెరచే ఉంచామని, బుధవారం రాత్రికి వర్షం కురిసి వరద రాకపోతే కొన్ని గేట్లను మూసి వేస్తామని జలమండలి అధికారులు తెలిపారు.

– మణికొండ



ఎంజీబీఎస్ వద్ద వరద ప్రవాహం



మంచిరేవులకు రాకపోకలను నిలిపివేసిన పోలీసులు

శ్రమదోపిడీ.. బతుకు గారడీ!

- వలస కార్మికుల విషయంలో యాజమాన్యాల నిర్లక్ష్యం
- ఫ్యాక్టరీల్లో కనీస వసతులు కరువు
- రక్షణ కవచాలు అందించడంలోనూ అలసత్వం
- తరచూ ప్రమాదాల బారిన పడుతున్న అభాగ్యులు
- గడిచిన రెండేళ్లలో 40 మంది మృత్యువాత



స్కాన్ ఎనర్జీ ఐరన్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఐరన్ లెడ్డు

షాద్‌నగర్: వలస కార్మికుల జీవితాలకు కనీస భరోసా లేకుండా పోతోంది. ఉన్న ఊరును వదిలి.. పొట్ట చేత పట్టుకుని వచ్చిన అభాగ్యులకు ఫ్యాక్టరీల్లో సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. కొందుర్గు శివారులోని స్కాన్ ఎనర్జీ ఐరన్ పరిశ్రమలో మంగళవారం జరిగిన పేలుడు ఘటన కార్మికుల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది.

తరచూ ప్రమాదాలు

షాద్‌నగర్ ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ఎంతో కార్మికులు యంత్రాల మధ్య నలిగిపోతున్నారు. వీరికి రక్షణ కవచాలు అందించకపోవడం, కర్మాగారాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, మొగిలిగిద్ద, ఎలికట్ట ప్రాంతాల్లోని స్పాంజ్‌ఐరన్, ఇతర పరిశ్రమల్లో 2012 నుంచి ఇప్పటి వరకు అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సుమారు 40 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. వందలాది మంది కార్మికులు క్షతగాత్రులుగా మారారు. తాజాగా కొందుర్గు శివారులోని స్కాన్ ఐరన్ పరిశ్రమలో ప్రమాదం జరిగి 8మంది కార్మికులు తీవ్రంగా గాయపడటంతో కార్మికుల భద్రత అంశం చర్చనీయాంశమైంది.

ప్రాణాలకు తెగించి విధులు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే పరిశ్రమలు కార్మికుల పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. పారిశ్రామిక వాడలను నమ్ముకొని, కుటుంబాలను వదిలి కొందరు.. కుటుంబాలతో మరికొందరు వలస వస్తున్నారు. సలసల మండే నిప్పుల కొలిమి వద్ద ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వీరికి అందుతున్న వేతనాలు సైతం అరకొరే. కనీసం రక్షణ కవచాలు కూడా అందించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వందలాది మంది మృత్యువాత పడ్డారు.

కన్నెత్తి చూడని అధికారులు

పరిశ్రమల్లో కార్మికులు అవస్థలు పడుతున్నా.. యాజమాన్యాల నుంచి నిర్లక్ష్యానికి గురవుతున్నా లేబర్ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలున్నాయి. నిర్వాహకులు ముట్టజెప్పే ముడుపులు తీసుకుని ఏమీ ఎరగనట్లు ఉంటున్నారనే విమర్శలున్నాయి. కనీసం ఆయా పరిశ్రమల్లో కార్మికులు మృత్యువాత పడిన సందర్భాల్లో కూడా బాధితులకు సరైన పరిహారం అందడం లేదని తెలుస్తోంది.

జిల్లాలోని పరిశ్రమలు

జిల్లాలో భారీ, మధ్య తరహా, చిన్న కలిపి సుమారు 3,474 పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో 2182 మైక్రో, 1094 చిన్న, 62 మధ్యతరహా, 103 భారీ, 9 మెగా,24 మెగా ఇన్‌ఫ్రా ఫ్యాక్టరీలు. వీటిలో అస్సాం, జార్ఖండ్, కర్ణాటక, బీహార్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 35 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు.

భద్రత కల్పించాలి



పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు యజమాన్యాలు భద్రత కల్పించాలి. అందరికీ రక్షణ కవచాలు అందించాలి. చాలా పరిశ్రమలు లాభాలే ధ్యేయంగా కొనసాగుతున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం సరికాదు.

– బుద్దుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. వలస కార్మికుల విషయంలో మరింత అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు. అడిగేవారే ఉండరని శ్రమదోపిడీకి గురిచేకస్తున్నారు. కార్మికుల సంక్షేమానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

నేడు ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం

సంఘం జిల్లా కన్వీనర్ నర్సింహ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని వాడ్యాల వసంతరెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి అతిథులుగా ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు.

బొప్పాయి.. సాగు మేలోయి

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి
- తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు అవసరం
- సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త శ్రీకృష్ణ


శ్రీకృష్ణ, సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త

కందుకూరు: బొప్పాయి పంటను వైరస్ తెగుళ్లు ఆశించి రైతులు నష్టపోతున్నారు. ఆ తెగుళ్ల బారినపడి పంట దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

వెర్రి తెగుళ్లు


వెర్రి తెగులు

మొజాయిక్, రింగ్‌స్పాట్(ఉంగరాల) తెగులు, ఆకు ముడత(క్రింకిల్) అనే మూడు రకాల వెర్రి తెగుళ్లు బొప్పాయి పంటనాశించి దిగుబడులను గణనీయంగా తగ్గించడమే కాక పండు నాణ్యతను బాగా దెబ్బతీసి విపరీత నష్టాన్ని కలిగించడంతో పాటు కొన్ని సందర్భాల్లో చెట్లు కాపునకు రాకుండా గొడ్డు చెట్టుగా మారడం జరుగుతుంది. ఈ మహమ్మారి వెర్రి తెగుళ్లను తొలి దశ నుంచే యాజమాన్య పద్ధతులతో అరికట్టాలి. వెర్రి తెగులు తాలుకు వైరస్ కణాలు ఒక మారు మొక్కలో ప్రవేశిస్తే మొక్క క్షీణించే వరకు దాని జీవకణాలలోనే ఉండి రకరకాలుగా లక్షణాలు కలిగించి అనర్థాలకు దారితీస్తుంది.

మొజాయిక్ తెగులు


మొజాయిక్ తెగులు సోకిన బొప్పాయి మొక్క

మొజాయిక్ తెగులు ఆశిస్తే ఆకు సైజు తగ్గుతుంది. ఆకులపై అక్కడక్కడ పసుపు రంగు మచ్చలు ఈనెలు లేకుండా ఏర్పడతాయి. దూరం నుంచి ఆకులు పసుపు రంగుకు మారినట్లు కన్పిస్తాయి. అందుకే దీనిని పల్లాకు తెగులని కూడా అంటారు. తెగులు సోకిన ఆకులు పెళుసుగా మారతాయి. చెట్ల పెరుగుదల తగ్గి ఎదుగుదల ఉండదు. పంట దిగుబడి నాణ్యత గణనీయంగా తగ్గుతుంది. కాయలు గిడస బారి నాసిగా ఉంటాయి. విత్తనం మరియు పేనుబంక ద్వారా తెగులు వ్యాపిస్తుంది.

ఉంగరాల(రింగ్‌స్పాట్) తెగులు


ఆకు ముడత సోకిన బొప్పాయి

ఈ తెగులు లక్షణాలు ఆకులు, కాడ, కాండం, పూత, పిందె, కాయ, పండ్లపై ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. లేత ఆకులు పచ్చదనం కోల్పోయి పసుపు పచ్చగా మారతాయి. ఆకుల ఈనెలు వంగి ముడుచుకుపోతాయి. దీంతో ఆకుల పరిమాణం తగ్గి సరైన మోతాదులో ఆహారాన్ని తయారు చేసుకోలేవు. కాండం పైభాగాన ఆకు తొడిమలపై ముదురాకు పచ్చని మచ్చలు, చారలు నూనె రాసినట్లు కన్పిస్తాయి. తెగులు తీవ్ర దశలో ఒక దానితో ఒకటి కలిసి మొక్క ఎదుగుదల తగ్గుతుంది. పూత, పిందె, కాయ, పండుపై గోధుమ రంగుతో ఉంగరాల్లాంటి రింగులు ఏర్పడతాయి. వీటి మధ్యభాగం ఆకుపచ్చగా ఉంటుంది. ఒక్కో పండుపై వీటి సంఖ్య వందల్లో ఉంటాయి. తెగులు సోకిన చెట్టు పూలు అంతగా పిందె కట్టవు. పిందెలు ఎదగవు. రింగులున్న కాయలు తొందరగా పండి మెత్తబడి నీరుకారుతాయి. నాణ్యత లోపిస్తుంది. దూరప్రాంతాల రవాణాకు పనికిరావు. విత్తనం మరియు పేనుబంక ద్వారా తెగులు వ్యాప్తి చెందుతుంది.

ఆకుముడత(లీఫ్ క్రింకిల్ లేదా కర్ల్) తెగులు


ఉంగరాల తెగులు సోకిన బొప్పాయి

ఈ తెగులు సోకిన చెట్లలో ఎదుగుదల తగ్గుతుంది. ముడతలు పడి ఆకులు ముడుచుకుని బంతిలా మారతాయి. ఆకు తొడిమ వంకర టింకరగా తిరుగుతుంది. వికృతాకారంగా ఉంటుంది. చెట్టు తల ఆకారం మారుతుంది. పూత రాక గొడ్డు చెట్టుగా మారవచ్చు. తెల్లదోమ ద్వారా తెగులు వ్యాప్తి చెందుతుంది.

తెగుళ్ల నివారణకు..

- ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు వాడాలి.
- విత్తన శుద్ధి తప్పనిసరి.
- నారు మొక్కలు ప్రధాన పొలంలో నాటేటప్పుడు వెర్రి తెగుళ్ల లక్షణాలుంటే తీసేయాలి.
- అంతర పంటగా మిరప, టమాటా, దోస పుచ్చ, గుమ్మడి లాంటివి సాగుచేయొద్దు.
- తెగులు సోకిన మొక్కలను గమనించిన వెంటనే తీసి నాశనం చేయాలి.
- సమతుల సమగ్రమైన ఎరువులను సకాలంలో అందించాలి.
- సూక్ష్మధాతు మిశ్రమాన్ని 3, 4 నెలల వయస్సులో ఒకమారు చెట్లపై పిచికారి చేయాలి.
- కలుపు మొక్కలు పొలంలోను, పొలం గట్లపైన లేకుండా పరిశుభ్రతను పాటించాలి.
- తోటలో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలి.
- అంతర సేద్యం చేసేటప్పుడు చెట్ల వేర్లకు గాయాలు తగలకుండా చూడాలి.
- రసం పీల్చే పురుగులతోనే వైరస్ తెగుళ్లు వ్యాప్తి చెందుతాయి. పేనుబంక, తెల్లదోమ పురుగులను సకాలంలో నివారించాలి. వాటి ఉధృతిని నివారించాలంటే థైయోమిథాక్సిన్ 0.3 గ్రా, లేదా డైఫెన్‌త్యూరియాన్ 1 గ్రా, లేదా స్పినోస్యాడ్0.3 మి.లీ లేదా ఎసిఫెట్ 1.5 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వాటితో పాటు 5 మి.లీ వేప నూనె లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- 15 రోజుల వ్యవధిలో పై మందులను మార్చుతూ రెండు, మూడు సార్లు పిచికారి చేసుకుంటే పురుగు వృద్ధి తగ్గుతుంది.
- బొప్పాయిలో వైరస్ తెగుళ్ల లక్షణాలు కన్పించిన మొక్కలను మొదట్లోనే పీకేయాలి.
- సరైన నీరు, పోషకాల యాజమాన్యం ద్వారా వైరస్ తెగుళ్లను అరికట్టవచ్చు. నీటి పోషకాల యాజమాన్యం సక్రమంగా లేకపోవడంతోనే తెగుళ్లు అధికంగా వస్తాయి.

మహిళను బెదిరించి..

- బంగారు గుండ్లు చోరీ
- ఆటో డ్రైవర్‌కు రిమాండ్


నిందితుడు యేసు

మోమిన్‌పేట: ఆటో ఎక్కిన మహిళను బెదిరించి బంగారు గుండ్లను చోరీ చేసిన డ్రైవర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండలం రేగడి ఘనాపూర్ గ్రామానికి చెందిన నాగమ్మ ఈ నెల 2న మండల పరిధిలోని సయ్యద్ అల్లీపూర్ గ్రామంలోని తన కూతురు వద్దకు వెళ్తోంది. ఆమె మోమిన్‌పేట్ బస్టాండ్‌లో వేచియుండగా.. కోటపల్లి మండలం బార్వాద్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాను అటే వెళ్తున్నానని నమ్మించి ఆటో ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో మొరంగపల్లి శివారులోని గుట్టపైకి తీసుకెళ్లి కత్తితో బెదిరించి మెడలోని బంగారు గుండ్లను దొంగిలించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటో నెంబర్ ట్రేస్ చేశారు. డ్రైవర్ యేసుపై నిఘా ఉంచారు. బుధవారం నిందితుడు బంగారు గుండ్లను అమ్మేందుకు మోమిన్‌పేటలోని ఓ జ్యూవెలరీ దుకాణానికి రాగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసు విచారణలో నేరాన్ని ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. గతంలోనూ ఓ వ్యక్తిని ఆటోలో ఎక్కించుకుని రూ.10వేలు దొంగలించిన ఘటనలోనూ జైలుకు వెళ్లినట్లు తెలిసింది.

వరిపై అప్రమత్తత అవసరం

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి


లష్కర్‌గూడలో వరి పంటను పరిశీలిస్తున్న గీతారెడ్డి, కవిత తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: వరి పంటలు ప్రస్తుతం పిలక దశలో ఉండగా కాండం తొలుచు పురుగులు పంటలను నాశనం చేసే ప్రమాదం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలోని వరి పంటలను బుధవారం ఆమె మండల వ్యవసాయాధికారి కవిత, విస్తరణాధికారి లక్ష్మణ్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. కాండం తొలుచు పురుగుల నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరా పంటకు 10 కిలోల చొప్పు చల్లుకోవాలని సూచించారు. దీంతో పాటు పంట పొట్టకొచ్చే ముందు ఎకరా వరి పంటకు 15 కేజీల యూరియాతో పాటు 12 కేజీల పొటాష్‌ను చల్లుకొని పంటలను రక్షించుకోవాలన్నారు. 2018 డిసెంబర్ 11కు ముందు రైతులు తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని, రైతులు సంబంధిత బ్యాంకులకు వెళ్లి రుణమాఫీ వివరాలను నిర్ధారించుకుని కొత్త రుణాలను తీసుకోవాలని సూచించారు.

'డబుల్' ఇళ్లు స్థానికులకే కేటాయించాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్


మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వారు మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా నిర్మించిన ఇళ్లను స్థానికులకు కాకుండా నగరంలోని ముస్లింలకు కేటాయించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సబితారెడ్డి ఏకపక్ష నిర్ణయంతో మజ్లిస్ పార్టీ, ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తుక్కుగూడ, మహేశ్వరం నియోజకవర్గంలో నిరుపేదలకు కేటాయించాలన్నారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు బి.యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బి.విలాస్, ఆర్.రాజు, మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పాపయ్యగౌడ్, దేవేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, సుధాకర్, మదన్‌మోహన్, భాస్కర్‌గౌడ్, రవితేజ, నర్సింగ్‌రాజు, సీతామ్మరెడ్డి, శ్రీనివాస్‌నాయక్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్, సిద్దిపేట రైల్వే లైన్లను కలపాలి


దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ కలిసిన మంత్రి హరీశ్‌రావు

మెదక్: ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్టులో మెదక్-సిద్దిపేట లైన్లను కలపాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే పెండింగ్ పనుల అంశంపై బుధవారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూర్ వంటి నగరాలకు రైళ్లను ప్రారంభించాలని కోరారు. అలాగే హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు పుష్పుల్ ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరారు. కొత్తగా నిర్మించిన సిద్దిపేట రైల్వేలైను ఈనెల 15న, రైల్వే సేఫ్టీ కమిషనర్ పరిశీలించనున్నారని, అదిపూర్తి కాగానే ప్యాసింజర్ రైళ్లను ప్రారంభించాలని మంత్రి కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద కొత్త రైల్వే స్టేషన్ పనులతో పాటు మెదక్ జిల్లా మాసాయిపేటలో రైల్వే పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. దేశచరిత్రలోనే సిద్దిపేట రైల్వేలైన్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు చొరవ చూపడతంతోనే సాధ్యమైందని చెప్పారు. తెలంగాణలో నిర్మించనున్న ఔటర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టులో మెదక్, సిద్దిపేటలను కలపాలని సూచించారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెదక్, సిద్దిపేట మీదుగా ఔటర్‌రింగ్ రైల్వేలైన్ నిర్మించాలని మంత్రి కోరారు. రూ.250 కోట్లతో 2 వేల ఎకరాల భూసేకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించినట్లు మంత్రి వివరించారు. ఆయన వెంట ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. మంత్రి వినతిపై దక్షణమధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సానుకూలంగా స్పందించారు.

జహీరాబాద్-తాండూర్ మధ్య కొత్త రైల్వే లైన్

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌ల మధ్య కొత్త రైల్వేలైన్‌కు ఎఫ్ఎల్ఎస్ మంజూరయింది. ఇందుకోసం రూ.1,350 కోట్ల మేర నిధులు అవస రం అవుతాయని అంచనా వేసింది. రైల్వే లైన్ నిర్మా ణం పూర్తయి వినియోగంలోకి వస్తే జహీరాబాద్-తాండూర్ మధ్య దూరం 65 కిలోమీటర్లు తగ్గనుంది. ప్రస్తుతం జహీరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా తాండూర్‌కు రైళ్లు రాక పోకలు సాగిస్తున్నా యి. దీంతో ప్రయాణికులకు అదనపు దూర ప్రయా ణం తప్పడం లేదు. రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అను సంధానాన్ని బలోపేతం చేసేందుకు దృష్టి సారించింది. రాష్ట్రంలో దాదాపు 15 కొత్త రైల్వేలైన్ల కోసం ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్)ను మంజూరు చేసింది. అందులో భాగంగానే జహీరాబాద్ నుంచి తాండూర్‌లోని సిమెంట్ క్లస్టర్ల వరకు లైను నిర్మా ణం చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాల మధ్య 75 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని రైల్వే శాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. తాండూ ర్ ప్రాంతంలో ఉన్న సిమెంటు కర్మాగారాలకు సైతం రైల్వే లైన్ ఉపయోగపడనుంది. అంతే కాకుండా ఆయా ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యంగా మార నుంది. ప్రస్తుతం రైలు, బస్సు సదుపాయాలు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఇరు ప్రాంతాల మధ్య మరింత అభివృద్ధి జరగనుంది.

పథకాలతో ఆర్థిక పురోగతి


జీవాలను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప

జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప

కొత్తూరు: ప్రభుత్వ పథకాలతో పేదలు ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప అన్నారు. మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో బుధవారం రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మల్లికార్జున గొర్రెల పెంపకందారుల సంఘంలోని 24మంది గొర్రెల యూనిట్లు పొందేందుకు తమ వాటా ప్రభుత్వానికి చెల్లించారన్నారు. కాగా వారిలో ఆరుగురు సభ్యులకు ఆరు యూనిట్ల (126)గొర్రెలు వచ్చాయని చెప్పారు. జీవాలు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చినందున వాటిని జాగ్రత్తగా పరిశీలించాలని కాపరులకు సూచించారు. స్థానిక వాతావరణం అలవాటు పడే వరకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకంలో పశువైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి లాభాలు సాధించ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యురాలు స్ఫూర్తి, సర్పంచ్ రమాదేవి, సంఘం సభ్యు లు సాయన్న, రమేశ్, నాయకులు మెండె కృష్ణ, బాలయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వాస్తుదోషం..!

ప్రధాన గేటు మూసివేసిన వైనం

మొయినాబాద్: మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం పట్టుకున్నట్టుంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న పీఎస్ ప్రధాన గేటును మూసివేశారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనున్న మొయినాబాద్ పీఎస్ ప్రధాన ద్వారం ఠాణాకు ఎదురుగా దక్షిణం వైపు ఉంది. కానీ రెండు నెలల క్రితం మొయినాబాద్ పీఎస్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్ వచ్చిన తర్వాత దక్షిణం వైపు ఉన్న గేటు మూసి మట్టి పోశారు. స్టేషన్‌కు తూర్పు వైపు ఉన్న పెట్రోల్ బంక్ పక్క నుంచి స్టేషన్‌లోని వెళ్లేలా కంచెను తొలగించి చదును చేయించారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కొత్తగా ఏర్పాటు చేసిన దారి బురదమయంగా మారి వచ్చిపోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇది చూసినవారు పోలీస్‌స్టేషన్‌కు వాస్తుదోషం పట్టిందని.. అందుకే గేటును పూర్తిగా మూసివేశారని చర్చించుకుంటున్నారు.


మొయినాబాద్ పీఎస్ ప్రధాన గేటు తీయకుండా పోసిన మట్టి